కథ

ఇలపావులూరి మురళీమోహనరావు

# విచక్షణ

"అన్నయ్యా, రేపు సంక్రాంతికి మాకు పెళ్లై ఇరవై ఐదు ఏళ్లొస్తాయి. మీ బావ సర్పంచ్ కూడా కావడంతో ఊళ్లో వాళ్లంతా ఏదో వేడుక చేస్తామంటున్నారు. నువ్వు మా ఊరొచ్చి పదేళ్లు దాటుతోంది. ఈసారైనా తీరిక చేసుకుని వదినెను, మాధురిని తీసుకుని మా ఊరు రావాలి. కనీసం పది రోజులైనా ఉండాలి" నా చెల్లెలు రమాదేవి రాసిన ఉత్తరాన్ని పదేపదే చదివాను.

నేను పుట్టింది ఒంగోలు దగ్గర చిన్న పల్లెటూర్లో. ముప్పై సంవత్సరాల క్రితం బ్రతుకుతెరువు కోసం హైదరాబాద్ చేరాను. ఒక రియల్ ఎస్టేట్ కంపెనీలో గుమస్తాగా చేరాను. చాలీ చాలని ఆదాయంతో ఇరవయ్యేళ్లు దినదినగండంగా బ్రతికాను. నా భార్య వసుంధర ఇచ్చిన ప్రోత్సాహంతో సొంతంగా రియల్ ఎస్టేట్ బిజినెస్ ప్రారంభించాను. అప్పటికి హైదరాబాద్‌లో భూవ్యాపారం బాగా పుంజుకుంది. రాత్రింబగళ్లు ఇద్దరం కష్టపడ్డాం. ఐదారు సంవత్సరాల క్రితం నుంచీ వ్యాపారం బాగా అభివృద్ధిలోకొచ్చి నాలుగు తరాలకు సరిపడా సంపాదించాను. తిండి కోసం ఎంతైనా ఖర్చు పెట్టగల స్థోమతుంది నేడు. అయితే ఏం లాభం? అప్పటికే నాకు రక్తపోటు, మధుమేహం లాంటి డబ్బుతో పాటొచ్చే సమస్త జబ్బులు సంక్రమించి జొన్నరొట్టెలు, రాగిసంకటి మాత్రమే తినగలిగే దౌర్భాగ్య స్థితికి చేరాను.

వయసు, ఓపిక ఉన్న కాలంలో సంపాదన తీరుగా లేకపోవడంతో మాధురి జన్మించగానే ఇంకా పిల్లల్ని కనడానికి భయమేసి సంతానోత్పత్తికి స్వస్తి చెప్పాం. ఇవాళ పదిమంది పిల్లల్నైనా పోషించగల శక్తి ఉన్నా పిల్లల్ని పుట్టించే ఓపిక మాత్రం లేదు. ఒక్కగానొక్క కూతురు కావడంతో మాధురిని అతిగారాబంగా పెంచి మేము పస్తులున్నా ఫర్వాలేదనుకుని, మంచి విద్యాసంస్థల్లో చదువు చెప్పించాం. మాధురి కూడా బుద్ధిగా చదువుకుని యమ్మెస్సీ బయోటెక్నాలజీ చదివి ప్రస్తుతం పి.హెచ్‌డీ చేస్తున్నది. ఇప్పటికే తనకు మల్టీనేషనల్ కంపెనీల్లో కళ్లు చెదిరిపోయే ఆఫర్లొస్తున్నాయి.

మా చెల్లెలు రమాదేవికి పదమూడేళ్ల వయసులోనే ఒంగోలు దగ్గరే మరో పల్లెటూర్లో ఒక రైతు కుటుంబంలోని ఆంజనేయులుకిచ్చి వివాహం చేశారు. వాళ్లకు అప్పుడు ఐదెకరాల మాగాణి, నాలుగెకరాల మెట్ట పొలం ఉండేది. మా బావ పెద్దగా చదువుకోలేదు. వ్యవసాయమే జీవనాధారంగా చేసుకున్నాడు. వద్దువద్దంటున్నా నలుగురు పిల్లల్ని కన్నారు. ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. పెద్దవాడు రమేష్ ఇంటర్ వరకు చదివి ఊళ్లోనే డెయిరీఫారం పెట్టుకున్నాడు. రెండో వాడు మురళి బియస్సీ చదివి ఆ తరువాత తను కూడా వ్యవసాయంలోకి దిగాడు.

నిజానికి మురళి కూడా వ్యవసాయంలోకి దిగడం నాకు ఇష్టం లేదు. వాడిని మా ఇంట్లో ఉంచుకుని ఇంజనీరింగ్ చదివించి మాధురినిచ్చి పెళ్లి చేసి అమెరికా పంపాలని ఉండేది నాకు. అయితే నా అంతట నేను బయటపడలేదు. నేను సిటీలో ఉంటూ పెద్ద వ్యాపారం చేస్తూ మంచి స్థితిలో ఉన్నాను కాబట్టి వాళ్లే నా సాయం అడుగుతారేమో అనుకున్నాను. కానీ అది జరగలేదు.

మురళి చదువుకు స్వస్తి చెప్పాడని తెలియగానే మేనల్లుడనే అభిమానంతో నేనే కంగారుగా మా చెల్లెలికి ఫోన్ చేసి 'చదువు మాన్పించవద్దని చెప్పాను. 'వాడికి వ్యవసాయం మీదే ఆసక్తి అన్నయ్యా' అని తేలికగా చెప్పింది మా చెల్లెలు.

నాది పల్లెటూరి నేపథ్యమే అయినా మూడు దశాబ్దాలు సిటీలో గడపటంతో ఆ వాతావరణం అలవాటై పోయింది. దాంతో పల్లెకు వెళ్లాలంటే అదో బద్ధకం. మా చెల్లెలే ఎండాకాలంలో పిల్లలను తీసుకుని మా ఇంటికొచ్చి నాలుగు రోజులుంటుంది. మా బావ మాత్రం రాడు. 'అగ్గిపెట్టెల్లాంటి గదులు. గాలీ వెల్తురూ రావు. ఓ చెట్టూ చేమా ఉండదు. వంటిల్లు పక్కనే లెట్రిన్లు, బెడ్రూమ్స్‌లో బాత్‌రూమ్స్. ఛీ.. ఆ వాతావరణంలో అరక్షణం కూడా ఉండలేను' అంటాడు. ఎలాగూ మా చెల్లెలి వివాహ జీవిత రజతోత్సవ సంవత్సరం కాబట్టి తప్పకుండా వెళ్లాలని నిర్ణయించుకున్నాను. వసుంధర, మాధురి కూడా సంతోషంగా అంగీకరించారు.

* * *

"సార్.. ఊరొచ్చింది" డ్రైవర్ చెప్పగానే మగత నిద్రలో ఉన్న మేం నిద్ర లేచాం. విండోస్ దించాం. గతుకుల రోడ్డు. తెల్లవారుతున్నది. రెండువైపుల్నించి చల్లని గాలి... పచ్చని పొలాలు. పొలాల మధ్య పిల్లకాలవలు. మరో వంక పెద్ద చెరువు. హుస్సేన్‌సాగర్‌కు మూడు రెట్లుంది. నిండుగర్భిణిలా ఉంది. అక్కడక్కడా నాచు. వాటిమీద కొంగలు, పక్షులు... రకరకాల కూతలు! మధ్యలో రివ్వున ఎగురుతున్న పక్షులు.. క్వా, క్వా.. చప్పుడు చేస్తూ నీటిమీద వయ్యారంగా నడుస్తున్న బాతులు..

"ఓహ్.. మార్వలెస్..." పరవశంగా చూస్తూ హేండీకామ్ తీసి షూట్ చేస్తున్నది మాధురి. చెంబులు చేత్తో పట్టుకుని ఊరి బయటకు వెళ్తున్న ఆడామగా మా కారు వంక విచిత్రంగా చూస్తూ నడుస్తున్నారు. గ్రామానికి చివర చెరువుకు దగ్గర్లో రోడ్డును ఆనుకుని రెండు వేల గజాల్లో మా చెల్లెలి ఇల్లు. బెంగుళూరు పెంకులతో కప్పు. ఒక వైపు పశువుల కోసం పాక, కొంచెం దూరంలో గడ్డివాములు. ఇంటి ముందు కారు ఆగగానే మా చెల్లెలు, పిల్లలు పరిగెత్తుకుంటూ బయటకొచ్చారు. వాళ్ల వెనకాలే మా బావ చేతిలో చెంబు, నోట్లో పొడవాటి చుట్టతో వచ్చాడు.

"రావయ్యా బావా.. ఎదురొచ్చావు.. పనౌతుందో కాదో" అన్నాడు గుప్పున పొగవదుల్తూ.

"ఏంటి బావా ఇంకా ఇంట్లో టాయ్‌లెట్స్ కట్టించలేదా?" అన్నాను పరిహాసంగా.

"మీలాంటోళ్ల కోసం రెండు కట్టించాం. నాకేమో చుట్ట కాల్చంది పనికాదు. లెట్రిన్లో చుట్ట కాలిస్తే మీ చెల్లెలు ఒప్పుకోదు. నే వెళ్లొస్తా.. మీరు లోపలికెళ్లండి" అని వసుంధరను, మాధురిని పలకరించి వెళ్లాడు.

"ఏంటి డాడీ.. ఇంకా ఈ రోజుల్లో కూడా ఇలా ఓపెన్‌గా..." అన్నది మాధురి అదో రకంగా ముఖం పెట్టి.

"ఇందులో గొప్ప ఆరోగ్య రహస్యం ఉంది. ఆ వంక పెట్టుకుని పోనూరానూ నాలుగు మైళ్ల నడకౌతుంది. నడవడం వల్ల పేగులన్నీ కదిలిపోయి ఫ్రీమోషనవుతుంది" నవ్వుతూ చెప్పాడు మురళి.

ముఖం కడుక్కోవడానికి పెరట్లోకి వెళ్లాం. దాదాపు రెండొందల చదరపు గజాల స్థలంలో కూరగాయల పాదులున్నాయి. పొట్లకాయలు, బీరకాయలు, దొండకాయలు, కాకరకాయలు, వంకాయలు వేలాడుతున్నాయి పందిళ్లకు.

"అబ్బ! ఎన్ని కూరలు! అబ్బబ్బ.. ఎంత ఫ్రెష్‌గా ఉన్నాయి" కళ్లు తిప్పుకోకుండా చూస్తున్నారు వసుంధర, మాధురి.

రమ పాల చెంబుతో గేదె దగ్గరకొచ్చి నాలుగుసార్లు వీపు నిమిరి పొదుగు ముందు కూర్చుని పాలు పితుకుతున్నది. పొదుగులోంచి పాలు ధారలుగా వస్తుంటే కళ్లు విప్పార్చి చూస్తున్నది మాధురి.

చుక్క నీళ్లు కలపకుండా ఇచ్చిన చిక్కటి కాఫీ అమృతంలా ఉంది. ఉభయకుశలోపర్లు అయిన తరువాత వేడివేడి దోసెలు టిఫిన్ చేసింది రమ.

ఎనిమిది గంటలకు పొలం వెళ్లబోతూ "మామయ్యా.. వస్తావా పొలానికి?" అడిగాడు మురళి.

"నాకు కొత్తేముందిరా? ఊహ తెలిసిన తరువాత నీ మరదలు పల్లెకు రావడం ఇదే తొలిసారి. దాన్ని తీసుకెళ్లి

పొలం చూపించు" అన్నాను.

మాధురి కూడా ఉత్సాహం చూపింది.

ఇద్దరూ నడుస్తూ వెళ్తున్నారు. ఎదురొచ్చే ప్రతి ఆడ, మగ "ఎవరు మురళయ్యో ఈ పిల్ల?" అని అడుగుతున్నారు. మాధురి బోల్డెంత ఆశ్చర్యపోతూ "ఇదే మా ఊళ్లో అయితే పొరుగింటి వాళ్లు కూడా పట్టించుకోరు" అన్నది.

"అదే పల్లెకూ పట్నానికీ తేడా. ఈ ఊళ్లో నాలుగొందల జనాభా. ప్రతి ఒక్కరికీ మిగిలిన మూడు వందల తొంభై తొమ్మిది మంది పేర్లు తెలుస్తాయి" అన్నాడు మురళి నవ్వుతూ.

ఏపుగా పెరిగిన పంటపైర్లను చూసి ఆనందిస్తున్నది మాధురి. జొన్న, సజ్జ, వరి, కంది, మినుము పంటలు పండిస్తున్నారక్కడ. కొన్ని మళ్లలో కోతలు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల నూర్పిళ్లు జరుగుతున్నాయి. అన్నిటి గురించి ఆసక్తితో వివరాలు తెలుసుకుంటున్నది మాధురి. తమ పొలాల దగ్గరకు తీసుకెళ్లాడు మురళి. కుప్పలుగా పేర్చిన వరి పనలను చూపించాడు.

ఇద్దరు కూలీలు వీరి దగ్గరికొచ్చారు. "మురళయ్యా.. కంకులు బాగా ఎండాయి. రేపు నూరుద్దాం. కూలోళ్లకు చెప్పాం. రేపు పదిమందొస్తారు" చెప్పారు.

"మంచిది. ఇవాళ మినుములు మార్కెట్‌కు తీసుకెళ్లండి" చెప్పాడు మురళి.


తరువాత రకరకాల పంటలను చూపిస్తూ వాటికి విత్తనాలు ఎలా సేకరిస్తారు, ఎలా నాటుతారు, ఎలాంటి ఎరువులు చల్లుతారు... అవి ఎలా పెరుగుతాయి, నీటివసతి ఎలా సమకూరుస్తారు, ఎన్నాళ్లకు కోతకొస్తాయి, పండించిన పంటను ఎలా అమ్ముతారు, ఎటువంటి నేలలో ఎంత దిగుబడి వస్తుంది.. లాంటి వివరాలు చెప్పాడు మురళి.

"పరిశ్రమల కోసం ఎంత కష్టపడాలో, దీనికీ అంతే కష్టపడాలి. కానీ వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించరు. పరిశ్రమల్లో ఏ చిన్న ప్రమాదం వాటిల్లినా ఇన్సూరెన్స్ ఉంటుంది. వానలు, వరదలు, కరువుకాటకాల వల్ల సేద్యానికి నష్టం వాటిల్లితే ఆ మొత్తాన్ని రైతు భరించాల్సిందే. ఆర్థిక మండళ్ల కోసం భూమి కావాల్సి వస్తే మొదటగా లాక్కునేది రైతుల భూముల్నే. పెద్దపెద్ద ఇండస్ట్రియలిస్టులకు, రాజకీయ నాయకులకు వందల ఎకరాల ఎస్టేట్లుంటాయి. వాటి జోలికి ఛస్తే పోవు ప్రభుత్వాలు" అన్నాడు.

"రైతులు కూడా సూట్లు, బూట్లు వేసుకుని కార్లలో తిరగాలి. అప్పుడే ప్రభుత్వాలు భయపడతాయి" చమత్కరించింది మాధురి.

మర్నాడు - సంక్రాంతి పండుగ రోజున సాయంకాలం ఎలిమెంటరీ స్కూలు ప్రాంగణంలో రమాదేవి, ఆంజనేయులుల వివాహ రజతోత్సవ వేడుకలు అంగరంగవైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే చీఫ్‌గెస్ట్‌గా వచ్చాడు. గ్రామస్తులే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా వందల మంది వచ్చారు. పూలమాలలతో దంపతులను సత్కరించారు. పది మంది పెద్దలు దంపతుల వ్యక్తిత్వం గురించి మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం సర్పంచిగా ఆంజనేయులు చేసిన కృషి గురించి ఒక రైతు కుటుంబంగా ఆయన, పిల్లలు సాధించిన విజయాల గురించి ప్రశంసించాడు. నేడు అందరూ వేలంవెర్రిగా తమ పిల్లలను విదేశాలు పంపిస్తుంటే ఆంజనేయలు మాత్రం తమ పిల్లలను వ్యవసాయానికే అంకితం చేసిన త్యాగమూర్తి అని, పల్లెల పట్ల, వ్యవసాయం పట్ల తనకున్న మక్కువను చాటుకున్న రైతు బాంధవుడని పొగడ్తల్లో ముంచెత్తాడు. రమాదేవి ఆయన అడుగుజాడల్లో నడుస్తూ స్త్రీజాతికే తలమానికంగా నిలిచిందని మెచ్చుకున్నాడు.

అందరి కరతాళ



ధ్వనుల మధ్య ఇద్దరినీ గజమాలతో, శాలువలతో సత్క రించాడు.

మా చెల్లెల్ని, బావను చూసి గర్వపడ్డాను. ఎమ్మెల్యే చెప్పిన దాంట్లో ఆవగింజంత కూడా అబద్ధం లేదు. నిజానికి ఇవాళ నూటికి తొంభై తొమ్మిది శాతం దంపతులు అనునిత్యం ఏవేవో గిల్లికజ్జాలతో కీచులాడుకుంటుంటారు. ఒక స్త్రీ ఎప్పుడైనా తన పుట్టింటికి వెళ్తే భర్త మీద, అత్తమామల మీద, ఆడపడుచుల మీద చాడీలు చెప్పడానికే కాలమంతా వ్యర్థం చేస్తుంది. అల్లుళ్లు కూడా చాలా మంది అత్తగారిళ్లకు వెళ్లినప్పుడు గొంతెమ్మ కోరికలు కోరుతుంటారు సిగ్గు లేకుండా. మా చెల్లెలు పెళ్లయిన తరువాత అత్తింటి వారి గురించి పొల్లు మాట్లాడి ఎరుగదు. మా బావ ఏనాడూ బట్టలు పెట్టించుకుని ఎరుగడు.

అందరి సమక్షంలో నేను, వసుంధర మా చెల్లెలికి, బావకు పట్టుబట్టలు పెట్టాం. చెల్లెలికి రెండు లక్షల రూపాయల ఖరీదు చేసే వజ్రాల హారం బహూకరించాం. పుట్టింటి నుంచి వచ్చిన ఆ బహుమతి చూడగానే రమాదేవి ముఖంలో పులకరింత దాచుకున్నా దాగలేదు. ఆ తరువాత వేలాదిమందికి అన్నదానం జరిగింది. దంపతులకు వచ్చిన కానుకలు, బహుమతులు ఇంటికి చేర్చడానికి ట్రాక్టరు కావాల్సొచ్చింది!

మరో నాలుగు రోజులున్నాం. వసుంధరకు, మాధురికి ఈ వాతావరణం బాగా నచ్చింది. ఒక రోజు కోడి పందేలు మరొక రోజు ఎడ్లపందేలు, బాగా ఎంజాయ్ చేశాం. మేం బయలుదేరుతుండగా మా ముగ్గురికి బట్టలు పెట్టారు. మధ్యలో ఒక సారి మాధురి పెళ్లి విషయం ప్రస్తావించింది రమాదేవి. “మంచి సంబంధం చూస్తున్నాం. పిహెచ్‌డీ అయిన తరువాత ఉద్యోగం చేస్తూ అప్పుడు చేసుకుంటానంటోంది” చెప్పాను ముక్తసరిగా.

★ ★ ★

ఇంటికొచ్చిన తరువాత మరో రెండు రోజులు ఆ జ్ఞాపకాలే. “మీ అమ్మాయిని మా వాడికిస్తారా అని మాటవరసకు కూడా అన్లేదు చూశారా మీ చెల్లెలు?” చురకేసినట్లు అన్నది వసుంధర.

“మనం కూడా అడగలేదుగా” అన్నాను నేను. మనం కోటీశ్వరులం కాబట్టి ముందు వాళ్లే మనల్ని అడగాలనేది ఆమె ఊహ.

మాధురి మీద నాకు మరో రకం ఆశలున్నాయి కాబట్టి నేనూ ప్రస్తావించలేదు. నా ఊహలన్నీ అమెరికా మీద, అమెరికా అల్లుడి మీద, అక్కడ వాళ్లు సంపాదించే డాలర్స్‌మీద ఉన్నాయి మరి! కట్నం కోసం కోటి రూపాయలు రెడీ చేసి ఉంచానెప్పుడో!

★ ★ ★

ఉదయం ఎనిమిది గంటలకు నేను ఆఫీసుకు బయల్దేరుతుండగా రివ్వున ఒక ఈజీకాబ్ వచ్చి ఆగింది. మోడర్న్ డ్రెస్‌లో ఉన్న పాతికేళ్ల యువకుడు దిగి “గుడ్మార్నింగ్ మామా” అని అరిచాడు. గొడుగును తలపిస్తున్న అతని జుట్టు, పిల్లిగెడ్డం, ముఖం మొత్తాన్ని కప్పేసిన గాగుల్స్, మోకాళ్ల వరకే ప్యాంట్, స్లీవ్‌లెస్ టీ షర్ట్ చూసి అతడిని నేను గుర్తించలేక పోయాను. కళ్లద్దాలు తీసి నవ్విన తరువాతే అతను వసుంధర మేనల్లుడు ప్రవీణ్‌గా గుర్తించగలిగాను. సడన్‌గా అతని రాక నాకు ఆశ్చర్యం కలిగించింది. కార్లోంచి పది ఎయిర్ బ్యాగ్‌లు దించాడు డ్రైవర్. పర్స్ తీసి వెయ్యి రూపాయల నోటును తీసి నిర్లక్ష్యంగా డ్రైవర్‌కిచ్చి ‘క్యారీ ఆన్’ అన్నాడు.


వసుంధర, మాధురి కూడా బయటకొచ్చారు. ప్రవీణ్‌ను చూసి వసుంధర ముఖం లక్షవాట్ల బల్బులా వెలిగింది. అందరం లోపలికొచ్చాం. అమెరికా నుంచి తెల్లవారుఝామున దిగానని, ఒకసారి అత్తను చూసి వెళ్దామని ఆగానని చెప్పాడు.

ప్రవీణ్ వసుంధర అన్నయ్య కొడుకు. వాళ్లన్నయ్య ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో కమిషనర్‌గా విశాఖపట్నంలో పనిచేస్తున్నాడు. ఉద్యోగంలో చేరిన కొద్ది కాలంలోనే తన ‘ప్రతాపం’ రుచి చూపించడంతో అనతికాలంలోనే కోటీశ్వరుడయ్యాడు. ఆయన ముగ్గురు పిల్లలు మూడు దేశాల్లో ఉంటున్నారు. ప్రవీణ్ మూడోవాడు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. నెల జీతం మన రూపాయల్లో రెండు లక్షలట! కబుర్ల పోగు!

లోపలకు రాగానే బ్యాగ్స్ ఓపెన్ చేసి మా ముగ్గురికీ మూడు ఐఫోన్లు ఇచ్చేశాడు. వాటిల్లోని ఫీచర్స్ మొత్తం చెప్పేశాడు. ఎవరెవరికి ఏమేం తెచ్చాడో చెప్పాడు.

టిఫిన్లు అయ్యాక “అత్తా.. ఐదేళ్ల నుంచీ గడ్డి తింటున్నాను. ఇవాళ నీ చేత్తో గుత్తివంకాయ కూర, బెండకాయ వేపుడు, పచ్చిపులుసు, కందిపచ్చడి చేసి పెట్టాలి. నాలుక మొత్తం తుప్పు పట్టింది” అన్నాడు.

వాడి కోరికల లిస్టు వింటుంటే నాకు లాలాజలం ఊరింది. బీపీ, షుగర్లని కాసేపు పక్క పెట్టి నేను కూడా






## కొత్త ‘ఫ్రెండ్’

సోహా అలీఖాన్-సిద్ధార్థల ప్రేమాయణం బెడిసికొట్టిందనే సంగతి ఇటీవల ఎక్కువగానే వినిపిస్తున్న నేపథ్యంలో సోహా తన కొత్త ‘ఫ్రెండ్’తో తరచూ కనిపిస్తుండడంతో బాలీవుడ్ జనాలకి మంచి కాలక్షేపం దొరికినట్టయింది. కునాల్ ఖేము అనే కుర్ర హీరోతో చెట్టాపట్టాలేసుకుని సోహా తిరిగేస్తుండడం నలుగురూ చూస్తున్నారు. దీంతో సిద్ధార్థతో ఇక సోహా ఎఫైర్ ముగిసినట్టేనని, కునాల్‌తో మొదలైనట్టుగా వుందని సినీజనాలు చెవులు కొరుక్కుంటున్నారు.

తినాలని నిర్ణయించుకున్నాను.

"మామయ్య వెళ్లి కూరలు తెస్తాడు. నువ్వీలోపల రెస్టు తీసుకో" నవ్వుతూ అన్నది వసుంధర. "మామయ్యెందుకు నేను తెస్తా. రైతుబజార్లో వెజిటబుల్స్ బాగుంటాయట గదా.. నేను వెళ్లి తెస్తా" అన్నాడు ప్రవీణ్.

"అమెరికాలో ఉంటున్నావు. ఎన్నడూ మార్కెట్లకు వెళ్లి ఎరుగవు. కూరలు జాగ్రత్తగా తీసుకోవాలి. వంకాయలు గుండ్రనివి తీస్కో. పుచ్చుల్ని జాగ్రత్తగా ఏరు. అలాగే బెండకాయల్లో ముదుర్లుంటాయి. జాగ్రత్తగా తీస్కో" సంచినిస్తూ చెప్పింది వసుంధర.

అరగంటలో వచ్చాడు నిండు సంచితో ప్రవీణ్. కత్తిపీటతో రెడీగా కూర్చుంది వసుంధర. మాధురి అప్పటికే అన్నం, పప్పు వండేసింది. కూరల సంచి బోర్లించాడు ప్రవీణ్. వాటిని చూసి అదిరిపడింది వసుంధర.

వంకాయలన్నీ పుచ్చులమయం. రంధ్రాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బెండకాయలు ముదురు బొచ్చెలు. కత్తి వంగుతున్నది కానీ బెండకాయ తెగడం లేదు.

వసుంధర నిర్ఘాంతపోయి "ఇవేంట్రా ఈ పుచ్చులు, ముదుర్లు తెచ్చావు?" అన్నది.

"నాకప్పుడే డౌటొచ్చిందత్తా. నువ్వు పుచ్చుల్ని, ముదుర్లని జాగ్రత్తగా ఏరి తెమ్మని చెప్పావని తెచ్చాను" అన్నాడు ప్రవీణ్ వింతగా.

మాధురి, నేను పగలబడి నవ్వాం పదినిముషాల పాటు. ప్రవీణ్ ముఖం చిన్నబోయింది. ఆ తరువాత నేను మళ్లీ వెళ్లి కూరలు తెచ్చాను.

మర్నాడు ఉదయం ఫ్లైటుకు విశాఖపట్నం వెళ్లిపోయాడు ప్రవీణ్. ఈ ఇరవై నాలుగు గంటల్లో అతని కళ్లు మాధురివైపు ఆరాధనా భావంతో చూస్తున్నాయని పసిగట్టడం మాకు కష్టం కాలేదు. నా కోరిక తీరే రోజు వచ్చిందేమోనన్న ఆనందం నేనూ దాచుకోలేకపోయాను.

"మీరు సరేనంటే మా అన్నయ్యనడిగొస్తా. వాడు వచ్చింది నాలుగు పెళ్లి సంబంధాలు చూసి ఏదోటి సెటిల్ చేసుకోడానికే అయ్యుంటుంది. బంగారం లాంటి మన సంబంధం ఉండగా మరెవర్నో ఎందుకు రానిస్తాను" అన్నది వసుంధర.

"సరే అనాల్సింది నేను కాదు. అమ్మాయి. అమ్మాయినే అడుగుదాం" మాధురిని పిల్చి విషయం చెప్పాను.

"నా ఇష్టానికే మీరు ఇంపార్టెన్సిస్తే.. నేను మురళి బావను చేసుకుంటా" అన్నది మాధురి.

మాకు దిగ్భ్రాంతి కలిగింది. నోట మాట రాలేదు ఐదు నిముషాలు!

"వాట్! ఆ పల్లెటూరి బైతునా?" కీచుగొంతుతో మాట తూలింది వసుంధర.

"అతను బైతు కాదమ్మా.. రైతు! దేశానికి నిత్యాన్నదాత! నిత్య శ్రామికుడు. సమాజానికి దిక్సూచి" నవ్వుతూ చెప్పింది మాధురి.

"కానీ... పొద్దస్తమానం పంచెకట్టుకుని బురదలో పనిచేసుకునే వాడు.. నీకే సుఖం ఉండదు" బేలగా అన్నాను. నా కలల సౌధం క్రింద భూకంపం వచ్చినట్లుంది.

"నాన్నా.. పద్మం బురదలోనే ఉంటుంది. బంగారం మట్టిలో ఉంటుంది. వాటిని హీనంగా చూస్తామా మనం?" అదే స్థాయిలో అన్నది మాధురి.

"ప్రవీణ్‌లో నీకు నచ్చందేమిటే?" ఉక్రోషంగా అరిచింది వసుంధర.

"ప్రవీణ్‌కు పాండిత్యం ఉంది. జ్ఞానం లేదు. తెలివి ఉంది. కానీ దాన్ని ఉపయోగించుకునే తెలివి లేదు. మనకు అవసరమైన కూరగాయలు సెలెక్టు చేసుకునే విచక్షణ కూడా లేదు. ఐదు సంవత్సరాల్లో నాలుగు కంపెనీలు మారాడు. ఇంకా చెప్పాలంటే... అతనికి డబ్బు, కెరీర్ ప్రైమరీ. పెళ్లి, జీవితం సెకండరీ. ఇక మురళి విషయం.. అతడికి పాండిత్యం లేకపోవచ్చు. కానీ జ్ఞానం ఉన్నది. అతనికి తన అవసరాలే కాదు, దేశం అవసరాలు కూడా తెలుసు. మురళి జీవితం నీతి, నిజాయితీ, ఆదర్శ కుటుంబం, సత్సంకల్పం అనే బలమైన స్తంభాల మీద నిలబడుంది. ఈ లోకంలో మనిషి సుఖంగా జీవించడానికి పాండిత్యం కంటే జ్ఞానం ముఖ్యం నాన్నా" స్థిమితంగా చెప్పింది మాధురి.

"కానీ తల్లీ... వ్యవసాయం అంతా ఒడిదుడుకులమయం. చాలినంత వర్షం లేకపోతే కరువు. ఎక్కువైపోతే పంట నష్టం" నా స్వరం కంపిస్తున్నది.

"ఒడిదుడుకులు ఏ రంగంలో లేవు నాన్నా? ఉద్యోగ రంగంలో లేవా? వ్యాపార రంగంలో లేవా? స్టాక్‌మార్కెట్లలో లేవా? పారిశ్రామిక రంగంలో లేవా? ఉద్యోగాలు ఊడిపోయి ఎంతమంది ఆత్మహత్యలు చేసుకోవడం లేదు? వ్యాపారాల్లో దివాలా తీసి పెద్ద పెద్ద బ్యాంకులే బోర్డు తిప్పేయడం లేదా? మీ రియల్ ఎస్టేట్ రంగం ఎన్నిసార్లు ఎగిరి బోర్లాపడింది? వరదలొచ్చి పంటలు నాశనమైపోవచ్చు. కరువులొచ్చి ఎండిపోవచ్చు. కానీ భూమి మాత్రం ఎక్కడికీ పోదు. ఒక రకంగా నువ్వు, మామయ్య ఆధారపడ్డది భూమి పైనే. నువ్వు భూమిని అమ్ముకుంటున్నావు. వాళ్లు నమ్ముకుంటున్నారు. మరో విషయం.. ఈ దేశంలో నెల కాగానే ఠంచనుగా జీతాలందుకునే ప్రతివాడూ సమ్మె చేస్తాడు. ఒక్క రైతు మాత్రం ఏనాడూ కృతఘ్నత చూపించి ఎరుగడు. మన పచ్చగడ్డి నేల మీద కాలుపెట్టినప్పుడు కలిగే పులకింత ఆ గాజు రోడ్లమీద కలగదు నాన్నా. మన టాటాలు, బిర్లాలు, అంబానీలు ఇండియాలో ఉంటూనే కోటానుకోట్లు సంపాదించారు. నేను చెప్పాల్సింది చెప్పాను. తరువాత మీ ఇష్టం" మేడపైకి వెళ్లింది మాధురి.

మాధురి వివేకానికి బుద్ధి వికాసానికి నా శరీరమంతా పులకరించిపోయింది! నా కూతురు మాధురి కాదు నేను మాధురి తండ్రిని అని చెప్పుకోవాలి.

త్వరలో వస్తున్నానని మా చెల్లెలికి చెప్పాలని పరిగెత్తుకుంటూ ఫోన్ దగ్గరకి వెళ్లాను.

ఎంత కోటీశ్వరుడినైనా నేను ఆడపిల్ల తండ్రిని కదా!



## దియా ఆత్మవిశ్వాసం

కొంతమంది హీరోయిన్లలా తను బాలీవుడ్‌లో కనుమరుగైపోయాననుకోవడం పొరపాటే అంటోంది దియామీర్జా. నేను మరీ ఎక్కువ సినిమాల్లో నటించకపోయినా నా ఆఫర్లు నాకు వస్తూనే వున్నాయి అంటోంది. ప్రస్తుతం తను ఐదు సినిమాలు చేస్తున్నానని, ఈ ఐదూ వేటికవే ప్రత్యేకత గల పాత్రలని చెప్పుకుంటున్న దియా- తను సంచలనం సృష్టించే సినిమాలు త్వరలోనే వస్తాయనే దృఢ విశ్వాసాన్ని ప్రకటిస్తోంది దియా. అవున్లెండి, ఆమాత్రం ఆత్మవిశ్వాసం వుండాల్సిందే.